# నా సినిమా జీవితం

## ....కుమారి గిరిజ

అసలు మాది కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా కంకిపాడునాజన్మస్థలం. నేనుపెరిగినది, చదువుకున్నదీ గుడివాడ. గుడివాడలో నేను స్కూలు ఫైనలు వరకుచదువుకున్నాను. సంగీతం మూడు సంవత్సరములు అభ్యసించేను. మాఅమ్మగారునటించిన చిత్రములు మావూరువచ్చినప్పుడుగాని, మా అమ్మగారు నాటకములలో నటిస్తూన్నప్పుడుగాని, ఇతరనాటకములు వచ్చిననూ, వెళ్లిచూద్దామన్నంత అభిలాష నాకు వుండేదికాదు. అసలు నేను సినిమాలలోచేరి నటించి, ఆర్టిస్టు, అవుతానని కలలో కూడా అనుకోలేదు. నిజంగా ఆలోచిస్తే, నాజీవితం గురించి నాకే ఆశ్చర్యంగా వుంటుంది. ఇకపోతే ఇపుడు అసలు విషయానికి వస్తాను.

నేను అసలు సినిమారంగానికి రావడానికికారకురాలు మాఅమ్మ. మాఅమ్మ అప్పుడు జెమినీవారు తీస్తున్న "వీరకుమార్"లో నటించడానికిమద్రాసు వచ్చినప్పుడు, మాస్కూలు సెలవల్లో మాఅమ్మని చూడడానికి వచ్చేను అంతే.

అప్పుడు శ్రీ. శివరావుగారు తీస్తున్న "పరమానందయ్యగారిశిష్యులు" పిక్చెరు కోసం అమ్మని చూడడానికి వచ్చినప్పుడు, ఆయన నన్ను కూడ చూడటం తటస్థించింది. ఆయన నన్ను చూచి మీ అమ్మాయి ఫేస్‌చాలాబాగున్నది. నేను నాపిక్చెరులో క్రొత్త ఆర్టిస్టులను తీసుకుందామని అనుకుంటున్నాను. నా పిక్చెరులో సెకండు హీరోయిన్ వేషము వుంది. మీఅమ్మాయిని తప్పకుండా వేయించమనికోరేరు. అప్పుడుమాఅమ్మ నన్ను అమ్మా! నీవునటించి ఒకస్టార్ అయిమంచిపేరు ప్రఖ్యాతులు పొందితే చూడాలని కోరికగా వుంది. గనుకనీవు తప్పకుండా యాక్టు చేయాలని పోత్సాహమిచ్చేరు. మాఅమ్మ నాకు ఇచ్చిన ప్రోత్సాహంవల్ల నేను కూడాఒక స్టార్‌ని అవుదామన్న కోరిక నాలో మొలకెత్తింది.

నాకు మొట్ట మొదట రోజున "మేకప్" బొట్టు పెట్టినది ఆర్టు డైరక్టరు. శ్రీయస్. వి. యస్. రామారావుగారు. ఆయన బొట్టు పెట్టినప్పుడే మాఅమ్మ "ఏమండీ! మీరుమీచేత్తో బొట్టు పెట్టేరు, మాఅమ్మాయి పెద్దస్టార్ అవాలని ఆశీర్వదించండి" అని నవ్వుతూ అన్నారు. "తప్పకుండా నాచేత్తో బొట్టు పెట్టేను గనుక మీఅమ్మాయి స్టార్ అవుతుంది." అని అన్నారు. ఆయనఆశీర్వాదం వల్లనే, నేను యింత వృద్ధిలోనికి రావటంజరిగిందేమోఅని అనుకుంటూ వుంటాను. అప్పుడు సరే! "మేకప్" వేసేరు. డ్రస్సువేసుకుని సెట్టులోనికి వెళ్లేటప్పటికి నాకు నూరు డిగ్రీల టెంపరేచరు వచ్చినది. తరువాత డైలాగు యిచ్చి యీషాటులో యిలా నటించాలని శ్రీ శివరావుగారు చెప్పేరు.



అన్నపూర్ణావారి 'వెలుగునీడలు'లో గిరిజ

దాంతో నాకు నూటరెండు టెంపరేచరు అయింది. గుండెల్లోదడ కాళ్లు వణుకూ, ప్రారంభమైనవి. మొగమంతా టెక్నీకలరు అయిపోయినది. నాజీవితంలోనటించడమనేది మొట్టమొదటి రోజు. మైక్ అంటే ఏమిటో, కెమెరా అంటే ఏమిటో నాకు అంతకు ముందు తెలియనే తెలియదు. నేను చూడలేదుకూడాను. ఈవన్నీచూసేటప్పటికే చెప్పరానంత భయమేసింది. ఏలాగు అయితేనేం. అతి కష్టంమీద డైలాగు చదువుకొని షాట్‌లో నిలుచున్నాను. క్లేప్ తీసుకుని వచ్చే వరకు ఏలాగు చేస్తానోయని చాలా భయపడిపోయేను. క్లేప్ కొట్టి వెళ్లి పోయిన తరువాత అంతకు ముందు నాలో వున్న భయం, అధైర్యం ఏమై పోయినదో నాకే తెలియదు. చాలా ధైర్యంగా నిలబడి వాళ్లు చెప్పినట్టు యాక్టుచేసేను. టేకు. ఒ. కె. అన్నారు. శ్రీ శివరావుగారు, షాట్ అయిపోయిన తరువాత శ్రీ శివరావుగారు, కురుమద్దాలి రామచంద్రరావుగారు, అంతా నాదగ్గరకు వచ్చి ఏలాగు చేస్తావో అనుకున్నాను అమ్మా! చాలా బాగా యాక్టు చేసేవు, మాకందరికీ చాలా సంతోషమయినదని మెచ్చుకున్నారు. అంత భయంతో, అంత అధైర్యంతో వున్న నాకు ఆ రోజున అంత ధైర్యం రావడానికి, నేను యీ రోజు వరకు యింత ఆర్టిస్టు అవడానికి కారణం మాదేవి దయవల్లనే అనుకుంటాను.

అప్పటినుంచీ యిప్పటి వరకూ ప్రతీ పిక్చెరులోనూ నటిస్తూ, శ్రీదేవి దయవల్లనూ, మాఅమ్మగారి ఆశీర్వచనములవల్లనూ, నిర్మాతల ప్రోత్సాహము వల్లనూ, అందరి మన్ననలను పొందుతూ, యిప్పటికి నేను ఆర్టిస్టు నయి నిలబడగలిగినందుకు చాలా సంతోషిస్తున్నాను.

ఇప్పటివరకునేను యీకేరక్టరుకు, నటించాలి. యీకేరక్టరు నటించకూడదు అన్న పట్టుదల నాకు లేదు. నాకు యీరకం కేరక్టరు యాక్టు

చేయడం కష్టం. ఇంకొకరకం (టైప్) కేరక్టరు యాక్టు చేయడం తేలిక అన్న విషయం జీవితంలో యిప్పటికి నా అనుభవంలోనికి రాలేదు. నాకు ఏరకం కేరక్టరు యిచ్చినా దానికి నాశక్తికొలదీ జీవం పోసి బాగు చేయడానికి ప్రయత్నిస్తాను. కొన్ని హీరోయిన్‌గా, కొన్నివేంపుగా కొన్ని విలన్‌గా, కొన్ని కామిడీగా, కొన్ని డాన్సరుగా కొన్ని రెండవ హీరోయిన్‌గా నటించేను, నటిస్తున్నాను కూడాను.

రెండవసారి నాజీవితంలో నేను నటించేప్పుడు కలిగిన మరి యొక్క అనుభవం.


ఒకనాడు సారథీ స్టూడియోలో సారథీవారి కులదైవంలో లత పాత్ర చాలా సింపథిటిక్ కేరక్టరు. లత వెధవపిల్లని తెలిసిన తరువాత ఒక ముఖ్యమయిన సీను యాక్టు చేసేటప్పుడు నన్ను నేను మరచి పోయేను— ఆసీను ఏమిటంటే—

తాను వెధవ పిల్లనని తెలుసుకున్న తరువాత కారణాలవల్ల అక్కగారిని, బావగారిని వదలి వెళ్లి, యింకొకచోటపని చేసుకుని బ్రతకవలసివస్తుంది. అప్పుడు ఆ సీనులో తన్ను చిన్నప్పటి నుంచీ పెంచిన అక్కతోనూ, బావతోనూ ఏడుస్తూ చెప్పి, తను ప్రేమించినటువంటి యువకునితో నేను వెళ్లి పోతున్నాను. నీపెళ్లికి తప్పకుండా ఉత్తరం వ్రాస్తావుకాదూ! అని డైలాగు చెప్పి, యాక్టుచేసి యింకా కట్ అనకముందే పడిపోయేను. పది నిముషముల తరువాత నాకు స్పృహ వచ్చినది. సెట్‌లో వాళ్లందరూ కంగారు పడ్డారు.. తరువాత స్పృహవచ్చి నేను మామూలుగానే పని చేసేను-- అంటే ఒక్కొక్క కేరక్టరు యాక్టు చేసేటప్పుడు ఆ కేరక్టరులో లీనమై నటిస్తూ వున్నప్పుడు నాకు తెలియకుండానే ఇటువంటి సంఘటనలు జరుగుతూ వుంటాయి. ఇదినాజీవితంలో జరిగిన రెండవ అనుభవం.

మొన్న యీమధ్య నటించిన పిక్చర్లలో, డి. బి. యన్.పిక్చరులో నటిస్తున్న పాత్ర ''పల్లెటూరి పిల్ల,—తూర్పుభాష మాట్లేది.— అందులో వకీలుగా నాప్రక్క శ్రీ రేలంగిగారు నటిస్తున్నారు. ఈపిల్లని నాగరికురాలిగాచేయా అన్న పట్టుదలతో వకీలు తన యింటికి తీసుకు వస్తారు.

అంతవరకు ఏమీ తెలియనిపిల్ల అవటంచే ఈవాతావరణం, అంతా చూచేటప్పటికి చాలా కంగారు పడుతుంది. అప్పుడు ఆ వకీలు అయిల్లు, హాలు, బాత్‌రూమ్ అవన్నీ చూపెడుతాడు. ఈ పిల్లకి అంతా అయోమయంగా వుంటుంది. బాత్ రూములో వున్న ''టబ్''చూపెట్టి, యిందులో స్నానం చేస్తారని చెప్పుతాడు. దీన్ని ''టబ్ అంటే ఏమిటో అర్థంకాక —''డప్పంటావేటి' అని అడుగుతుంది. ఇది షవరు, బాత్, యిలా తిప్పితే నీళ్లు వస్తాయి. స్నానం చెయ్యవచ్చు అని అంటాడు. ఈపిల్ల అమాయకంగా దాని క్రిందకి వెళ్లి నిలబడుతుంటే. వకీలు ''షవర్‌బాత్'' తిప్పగానే నీళ్లు పడతాయి. అది చూసి యిదికంగారుపడి ''ఓలమ్మో! సినుకులు, సినుకులు, ఓ నడిపోతంది'' అంటూ పరుగెత్తుకొని వస్తుంది. ఆ షాట్ అయిన అరగంట వరకూ టెక్నీషియన్లు, సెట్‌లో వున్న మిగతా వారు అంతా కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుతూనే వున్నారు. కొన్ని కేరక్టర్లు మేము నటించే టప్పుడుమాకు తెలియకుండానే హ్యూమర్'' వస్తుంది. గనుకనే అంతా నవ్వుతారు. పాత్ర ఏరకం అయినా అర్థం చేసుకుని, ప్రేక్షకుల మన్ననలను పొందేటట్టు నటించడమే నా ఆశయం.

ముందు ముందు కూడా మరింత బాగా నటించి ప్రేక్షకుల ఆదరాభిమానములు పొందడానికి ప్రయత్నిస్తాను. నా రాబోవు చిత్రములు చూచి, నన్ను ప్రేక్షకులు లోగడ మాదిరిగానే ఆదరిస్తారని ఆశిస్తున్నాను. ★



భరణి పిక్చర్స్ ''బాటసారి''లో భానుమతి, రమణమూర్తి



''బాటసారి''లో భానుమతి